ఇలా అన్నాడు: "పార్టీ నాయకత్వాన్ని అభివృద్ధిపరచడానికి మార్పులు చేసితీరాలి." ఈ కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చాయనడానికి మరొక నిదర్శనం కనిపిస్తూంది—రుమేనియన్ కార్మికుల కమ్యూనిస్టుపార్టీ సమావేశాన్ని గత మార్చిలో జరపాలని ఇదివరలో నిశ్చయించి అక్టోబరు 30 వ తేదీవరకు దానిని వాయిదా వేశారు. ఈలోగా పార్టీలో విభేదాలను తొలగించడానికి ప్రయత్నిస్తారు.

కమ్యూనిస్టుపార్టీ చిక్కులను జార్జియుదెజ్ ఒప్పుకుంటున్నరోజునే రుమేనియన్ ప్రభుత్వం ఒక ప్రకటనచేస్తూ పార్టీలో ఆరు సంవత్సరాలుగా చీలికలున్నాయని బయలుపెట్టింది. 1944 నుంచి 1948 వరకు కమ్యూనిస్టు న్యాయశాఖామంత్రిగావున్న లుక్రెతియు పత్రాస్కానూ, ఇంకా మరికొందరు కమ్యూనిస్టుపార్టీ నాయకులూ ఆరు సంవత్సరాల క్రిందట అరెస్టు చెయ్యబడ్డారనీ, వారు రహస్యంగా ఈ మధ్య విచారణ చెయ్యబడ్డారనీకూడా రుమేనియాప్రభుత్వ ప్రకటనలో ఉదహరించబడింది.

పత్రాస్కానూ మొదలైనవారు గూఢచారులుగా పనిచేశారంటూ కమ్యూనిస్టుపార్టీ లేనిపోని ఆరోపణలు చేసినప్పటికీ, నిజమేమిటంటే వారందరూ రుమేనియన్ కమ్యూనిస్టుపార్టీ కంట్రోలును, కుతంత్రాల్ని ప్రతిఘటించారు. అందుకు ప్రతీకారంగా కమ్యూనిస్టుపార్టీ పత్రాస్కానూను కాల్చిచంపి, తదితరులకు యావజ్జీవశిక్ష విధించింది.

ఈ నూతన "సమష్టి నాయకత్వం" ప్రకారం రుమేనయన్ కమ్యూనిస్టులు తమచిక్కులన్నిటినీ తొలగించుకోగలరో లేదో చూడవలసిందేగాని ఇప్పుడేమీ చెప్పడానికి వీలులేదు. కాని ఒక్కటి మాత్రం ఖాయం: రుమేనియాకు పరిపాలకుడు ఒకడైనప్పటికీ, అనేకమంది అయినప్పటికీ ప్రజల పరిస్థితిమాత్రం మారబోదు. ఎందుకంటే రుమేనియా ప్రజలకు సంబంధించిన ముఖ్యనిర్ణయాలన్నీ మాస్కో నాయకులే చేస్తున్నారు.

---

స్కెచ్

# వెంకటేశ్వర్లు

విశ్వమిత్ర

రోజూ పేపరు చదవటం వెంకటేశ్వర్లుకి అంతగా అలవాటు లేదు. ఒకవేళ చదివినా పేపరంతా క్షుణ్ణంగా చదవడు. కనీసం హెడ్డింగ్సైనా చూసి వొదిలిపెట్టడు. ఏదో తనకి నచ్చిన ఒకే ఒక న్యూస్ మొదట్నుంచి చివరిదాకా చదివేస్తాడు. ఆనాడేదో యాథాలాపంగా లైబ్రరీకి వెళ్లి ఏదో చదివి ఇంటికొచ్చి దీర్ఘంగా ఆలోచించటం మొదలెట్టాడు.

బుజ్జిగాడు హిస్టరీ పాఠంబట్టీ వేస్తున్నాడు. శివాజీ...గాంధీ...నెహ్రూ......అందరీ జీవితచరిత్రలు క్రమప్రకారం సాగిపోతున్నయ్. అవన్నీ తనూ చదివాడు. కానీ యివ్వాళ బుజ్జిగాడు ఎలా చదువుతున్నాడో అలాగే చదివేశాడు. వెంకటేశ్వర్లు దీర్ఘంగా ఆలోచించే విషయాలు చాలా తక్కువ. ఆలోచించటం మొదలెడ్తే అంతు తెలీదాకా వూరుకోడు. ఈ హిస్టరీ పుస్తకాల్లో గొప్పగొప్పవాళ్ళ జీవితచరిత్రలు ఎందుకు రాస్తున్నట్టు? చర్చిలు చిన్నప్పుడు న్యూసు పేపర్లమ్ముకొనే కుర్రాడు! ... చా-ఎన్-లే-ఒక కాఫీహోటలు సర్వరు! ... ఈ విషయాలతో ఆ పాఠాలకి ఏమాత్రం సంబంధంవుందో ఆ పరీక్షలన్నీ పాసయిన తనకి తెలుసు!

బుజ్జిగాడు చదివే జీవిత చరిత్రలన్నీ చదివిన తర్వాత వెంకటేశ్వర్లుకి తను ఆనాటి సాయంత్రం లైబ్రరీలో చదివిన "రాల్ఫ్‌బంచ్" జీవితచరిత్ర కళ్ళకు కనిపించింది. నిజానికి తలుచుకొంటే తనెందుకు ఒక రాల్ఫ్‌బంచో, ఒక నెహ్రూనో, ఒక గాంధీనో కాలేడు? వాళ్లు తనకంటే, తన వయస్సులో ఏం గొప్పవాళ్లు? ఫిఫ్తుఫారంవరకూ నిరాఘాటంగా చదివి ప్రతిపరీక్షా పాసయిన

వెంకటేశ్వర్లుకి ఈ అనుమానం రావటంలో తప్పేంలేదనిపించింది. తన ఖర్మకాలి ఈ గుడ్డల కొట్లో కుర్రాడు కావలసొచ్చిందిగానీ తన తెలివి కేంలోటు? తన దురదృష్టవశాత్తూ పేపర్లమ్మే కుర్రాడిగానో; కాఫీహోటలు సర్వరుగానో చేరలేదుగానీ చేరివుంటే ఈపాటికి తనొక చైనాకి ప్రధాని కాకపోయేవాడా? గుడ్డలు కొనుక్కున వాళ్ళదగ్గిర్నుంచీ దమ్మిడీకూడా ప్రతిఫలం కోరకుండా గజాలకి గజాలు కొలిచి యిచ్చేసిన వెంకటేశ్వర్లుకి ఇంతపెద్ద ఆలోచనలు చేసేటప్పటికి ఆవలింతలొచ్చినయ్. మిణుగురుపురుగు వెల్తురులాటి దీపపు వెలుగులో బుజ్జిగాడు "జీవిత చరిత్ర"ల్లోటి ఇంకా కుస్తీ పడుతూనేవున్నాడు.

కొంతసేపు మంచి గాఢనిద్రపోయిన తర్వాత వెంకటేశ్వర్లుకి అకస్మాత్తుగా మెలకువవొచ్చింది. చార్మినార్ ఒకటి వెలిగించి పక్కకి చూశారు. బుజ్జిగాడు హిస్టరీపుస్తకం మీదేసుకుని ఒళ్ళు మరిచిపోయాడు. వెంకటేశ్వర్లు వాణ్ణి తట్టి లేపి కూర్చోపెట్టాడు. కళ్లు నలుపుకొంటూ 'స్వాతంత్ర్యోద్యమం స్వాతంత్ర్యోద్యమం' అంటూ నెమరువేయటం మొదలెట్టాడు బుజ్జిగాడు. ఆ మాట వినగానే వెంకటేశ్వర్లుకి మళ్ళీ తన నిద్రకి ముందున్న ఆలోచన్లన్నీ నిద్రలేచినై. బ్రిటిషు వాళ్ళ కాళ్లు తన్నులు జైళ్లు అన్నీ జ్ఞాపకం రావటం మొదలెట్టాయ్. అవన్నీ తలుచుకుంటే వెంకటేశ్వర్లుకి భయమేసింది. కాలుస్తూ కాలుస్తూన్న సిగరెట్ అయిపోయింది. కొత్తది అంటించాడు. అంత గొప్పవాళ్లువటానికి ఆమాత్రం ఓర్పు వుండకపోతే ఎలా అని మళ్ళీ సద్దుకొన్నాడు. ఈసారి వెంకటేశ్వరు ఇందాకటంతగా ఆలోచించలేదు. కారణం అతడు ముందే అంతా ఆలోచించేసి ఓ నిర్ధారణకి రావటం జరిగిపోవటమే!

తెల్లవారింది. రోజూ తెల్లవారుతూనే వుంది గానీ, ఆ రోజు తెల్లవారటం ఓ కొత్తదనం కనిపించింది వెంకటేశ్వర్లుకి. తనకి తనే కొత్త! ప్రపంచానికి కేది వింత? తను ఆ కిందటి రోజూదాకా పనిచేస్తున్న గుడ్డలకొట్టు ప్రొప్రయిటరుకి సవినయంగా రాజీనామా అందచేశాడు వెంకటేశ్వర్లు. ఆ రోజే పక్కనున్న పట్టణానికి పోయి ఒక న్యూస్ పేపరు ఏజంటుగార్ని కలుసుకొన్నాడు. వెంకటేశ్వర్లు తన్న క్వాలిఫికేషన్ను బట్టి కాకపోయినా, తన అవసరంకొద్దీ ఆ ఏజంటు వెంకటేశ్వర్లుని, చందాదారు లందరి ఇళ్ళకి వెళ్లి పేపర్లు ఇచ్చే ఉద్యోగానికి కుదుర్చుకొన్నాడు

తను చదువుకొన్న 'హిస్టరీ'ని పూర్తిగా ఇవ్వాల్టికి వుపయోగించుకొన్నానుగదా అని సంతోషించాడు వెంకటేశ్వర్లు. గుడ్డలకొట్లో ఉద్యోగముకంటే ఇదే వెయ్యిరెట్లు బావుందనిపించింది వెంకటేశ్వర్లుకి. వెయ్యిరెట్లు కష్టంగా వున్నా వెంకటేశ్వర్లుకి అలా అనిపించలేదు. కారణం తను ఈ ఉద్యోగంకోసం కాదుగా చేరింది! ఇదెన్నాళ్లు... తను చర్చిల్ అంతటి వాడయ్యేవరకేగా! ఎప్పుడన్నా కాస్త కష్టమనిపించినప్పుడన్నా వెంకటేశ్వర్లు ఈ విషయాన్నే తలుచుకొనేవాడు. వెంటనే వెయ్యిరెట్ల బలం వొచ్చినట్టయ్యేది. తన స్నేహితులందరితో కూడా యీ విషయాన్ని చెపుదాం అనుకొన్నాడుగానీ, మళ్ళీ తన ఉద్యోగానికి అడ్డంవొస్తారేమో అని అనుమానం వేసింది. అందుకనే వెంకటేశ్వర్లు అందరితోనూ కలిసికట్టుగా వుండలేకపోయేవాడు.

ఆరునెలలు గడిచినయ్. వెంకటేశ్వర్లుకి తన జీవితంలో మరేమీ కనిపించలేదు. జీతంమటుకు నెలకోరూపాయి చొప్పున పెరిగింది. వీలైనప్పుడు న్యూసుపేపరు చదవటానికి ప్రయత్నించేవాడు గానీ స్వతహాగా పేపరుచదవటంలో అంతఆసక్తి లేకపోవటంలో అంత హుషారుగావుండేదిగాదు. ఇంకో ఆరునెలల తర్వాత వెంకటేశ్వర్లుకి అనుమాన మొచ్చింది తన వుద్యోగానికీ, తను కాదలచుకొన్న ఉద్యోగానికీ సంబంధమేమిటా అని మొదట సంబంధం లేదేమోనని బాధపడ్డాడు గానీ, తర్వాత లోతుగా ఆలోచించినమీదట లేకపోవటమేమిటనిపించింది. పేపర్లమ్ముతుండడం వల్ల, పేపర్లో న్యూసు ఏమిటో తెలియకమానదు. తెలిసిన తర్వాత దాన్నిగురించి ఏదో ఒక అభి అభిప్రాయమంటూ కుదుర్చుకోక తప్పదు. ఇహ తన అభిప్రాయాన్ని బైటికి రానివ్వగలిగితే తను మాత్రం అంతగొప్ప వాడెందుక్కాలేడు? ఆ రోజునుంచీ వెంకటేశ్వర్లు పేపరు శ్రద్ధగా చద

వటం మొదలెట్టాడు. కానీ అదో పరీక్షకింద ఐతే ఎన్ని రోజులని చదవగలడు? ఇంకా పరీక్ష అయినా నయమే! ఏదో ఒక గమ్యమంటూ వుంటుంది. ఐనా ఈ పొలిటిక్స్ యివ్వాళవున్నట్టు రేపుండవు. ఈ నాయకుల్ని తలుచుకొంటే వొళ్లు మండేది వెంకటేశ్వర్లుకి తనవుద్దేశం కేవలం గొప్ప వాడు అవటమైతే ఇంతకంటే మంచిదోవ ఇంకొ టుందనిపించింది. కాని దానికి సిగరెట్ తర్వాత సిగరెట్ కాల్చుకోడానికి అవకాశముండదు. నిజమే. కాని తను అంత గొప్పవాడవదలుచు కొన్నప్పుడు ఆ మాత్రం త్యాగం చేయలేనా అని పించింది వెంకటేశ్వర్లుకి.

ఆ మర్నాడే చందా పుస్తకాలూ, డబ్బూ అణాపైసలుతోసహా లెక్కచెప్పి ఏజంటుకి అప్ప చెప్పాడు. వెంకటేశ్వర్లు నిజాయితీకి ఏజంటు ఎంతో మెచ్చుకున్నాడు. అతనిలా లెక్క అప్పచెప్పి వెళ్ళినవాళ్లెవరూ తనకి దొరకలేద న్నాడు-నిజమే ఆవిషయాలన్నీ బాగా నేవున్నయ్. కాని వెంకటేశ్వర్లు గమ్యం అదికాదుగా మరి. అందుకని ఆతని రాజీనామాని విరమించుకోకపోవ టానికి అతనేం జంకలేదు.

తర్వాత కార్యక్రమాన్ని ముందుగానే ఆలో చించుకొని వుండడంవల్ల వెంకటేశ్వర్లు కొంచెం కష్టపడ్డా తొందర్లోనే ఓ హోటల్లో సర్వర్‌గా చేరగలిగాడు. మొదట్లో ఆ ఉద్యోగం కొంచెం కష్టంగానే వుందిగానీ కొత్తలో వెంకటేశ్వర్లుకి అట్టే బాధగా ఏంతోచలేదు. పైగా ఇదివరలా కాకుండా ఈసారి వెంకటేశ్వర్లు, మొదట్నుంచీ వొచ్చేపొయ్యేవాళ్ల మనసుల్నీ, మాటల్నీ ఓకంట కనిపెడుతుంటంవల్ల పని అట్టే కష్టం అనిపించేది కాదు. ఆతని ఉద్దేశం అలా ఎంతోమంది మన సుల్ని, మన స్తత్వాలనీ వొంటబట్టించుకొన్నాక వాళ్ళమీద కొన్ని వ్యాసాలు రాసి వాటిద్వారా 'బెర్ట్రెండ్ రస్సెల్' లాగా పైకిరావాలని. ఈ విషయంలో అతను చేయని పనంటూలేదు. పడని కష్టమంటూలేదు. కానీ విభిన్న మన స్తత్వాలుగల మనుషులు రావటానికిదేం ఎగ్జిబిషన్‌లాంటిదా? ఆరునెలలు ఆ ఉద్యోగంచేసి నేర్చుకొన్నది ఏమిటీ అంటే బాలన్స్‌తో ఆరడజను, కాఫీ కప్పుల్ని ఒకేచేత్తో పట్టుకురావడం. ఓరోజున వెంకటేశ్వర్లు ఏదో ఆలోచిస్తూ ఎవరికో ఓ అర కప్పు కాఫీ తీసుకొచ్చాడు. దాంట్లో చచ్చి పోయిన ఈగ కళేబరం ఒకటి తేలుతూండటం పరధ్యానంలో వెంకటేశ్వర్లు గమనించనేలేదు. తర్వాత ఐదునిముషాల్లో ఏదో కొంత సంభాషణ జరిగింతర్వాత వెంకటేశ్వర్లు చెంపమీద ఛెళ్లుమని చెంపదెబ్బ మోగింది. ఆ దెబ్బతో 'ఛీ' అనిపించింది వెంకటేశ్వర్లుకి ఆ ఉద్యోగంమీద. గొప్పవాళ్ళ యిన వాళ్ళందరూ ఇలా చెంపదెబ్బలుతిన్నారా? అనిపించింది. ఒక్కసారిగా వెంకటేశ్వర్లులో ఏదో వింత అనుభూతి కలిగింది. తనలో తను ప్రశ్నించు కొన్నాడు. "నేను ఎవరినో అవటమేమిటి"ని "నిజమే నేను నేనే! నా గొప్పతనం నాదే! నేను ఎవరిలానో అవాలనుకోవటంకంటే నాలాఎవరైనా ఎందుకవగూడదు అనిపించింది వెంకటేశ్వర్లుకి. వెంటనే న్యూస్ ఏజెంట్ తన నిజాయితీకి మెచ్చుకోవటం, హోటలు ప్రొప్రయిటర్ తన నేర్పుకి నెలకి ఐదురూపాయలుకొద్దీన జీతం పెంచటం, తాన్లకితాన్లు కొలిచినా అంగుళం తేడా వుండదని గుడ్డలకొట్టు ప్రొప్రయిటర్ తనని మెచ్చుకోవటం ఒక్కసారిగా జ్ఞాపకమొచ్చి నట్లు వెంకటేశ్వర్లుకి.

ఒకడిలా ఒకడు కాడు. దేశంలో వుండేది ఒక చర్చిలే, ఒక గాంధీయే, ఒక నెహ్రూనే, ఒక్క వెంకటేశ్వర్లే! అని తీర్మానించుకొన్నాడు వెంకటేశ్వర్లు.

